తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలువురు కార్పొరేటర్లతో మంగళవారం తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. తనకు మూడోసారి విజయం చేకూర్చినందుకు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పండాల సతీష్‌గౌడ్, ముద్దం నరసింహయాదవ్, జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, తూము శ్రావణ్‌కుమార్, శ్రీహరి తదితరులున్నారు.

ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కు శుభాకాంక్షల వెల్లువ


ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌తో పాండు రంగారావు


శుభాకాంక్షలు తెలుపుతున్న మోయిజ్

కూకట్‌పల్లి: ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన గడ్డం ప్రసాద్‌ను మంగళవారం పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల పాండు రంగారావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ స్పీకర్‌గా కాబోతున్నందుకు హార్దిక శుభాకాంక్షలు తెలిపానని పేర్కొన్నారు.

కూకట్‌పల్లి: స్పీకర్‌గా వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను మల్కాజ్‌గిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోయిజ్ పుష్పగుచ్ఛం అందజేసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న మాధవరం కాంతారావు



కూకట్‌పల్లి: మేడ్చల్ బాచుపల్లి క్రాంతినగర్‌లోని శ్రీ మదలర్మేల్ మంగా, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ చైర్మన్, కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుకున్నానని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానవసేవే దైవసేవతో సమానం


వృద్ధాశ్రమంలో బియ్యం అందించిన రాణాప్రతాప్ సూరగన

కూకట్‌పల్లి: కార్తీకమాసం చివరి రోజు సందర్భంగా పేదలకు దాన ధర్మాలు లాంటి మంచి కార్యాలు చేస్తే చాలా పుణ్యం లభిస్తుందని, మనం చేసే సేవలే దైవసేవతో సమానమని సేవ్ ఎ లైఫ్ సంస్థ అధ్యక్షుడు రాణాప్రతాప్ సూరగన అన్నారు. మంగళవారం మయూరీనగర్‌లోని ఆశ్రయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవతావాదులు సహృదయంతో ముందుకొచ్చి అనాథలు, అభాగ్యులు, పేద వృద్ధులు, అభాగ్యులకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. షహీన్ అఫ్రోజ్, జనరల్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శివకల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని శ్రీహరి హరక్షేత్రంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శివకల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు కృష్ణసూరి సమక్షంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు అనంతరం రాత్రి కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

అల్విన్‌కాలనీ: అల్విన్‌కాలనీ చివరి బస్‌స్టాప్, పీజేఆర్‌నగర్ బస్‌స్టాప్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ.. కాంగ్రెస్ పార్టీ అల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ ఇషాక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. రూట్‌ను పరిశీలించి బస్సుసౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గోపాల్, శ్రీదేవి, రాయుడు, దాస్, రూబెన్, శ్రీను తదితరులున్నారు.



కలుషితమవుతున్న తాగునీరు

● రోడ్డుపైనే వృథాగా వదిలేస్తున్న వైనం ● నీటి పొదుపుపై అవగాహన కల్పించని అధికారులు


వివేకానందనగర్ డివిజన్‌లో వృథాగా పారుతున్న తాగునీరు


అల్విన్‌కాలనీలో రోడ్డుపై ఇలా ..

అల్విన్‌కాలనీ: అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు లీకేజీ అయ్యి రోడ్డు పాలవుతోందనే ప్రజలు వాపోతున్నారు. ప్రజాధనం దుర్వినియోగమవడంతో పాటు తాగునీటిలో మురుగు చేరి కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ అసలే శీతాకాలంలో విషవ్యాధులతో పాటు దగ్గు, దమ్ము, జలుబు వంటి వ్యాధులు ప్రబలుతుండటంతో స్థానికులు అయోమయానికి గురవుతున్నారు. సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

◆ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట, రిక్షాపుల్లర్స్ కాలనీ, ప్రగతినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ, అల్విన్‌కాలనీ, రామకృష్ణనగర్ తదితర కాలనీల్లో పైపులైన్లు పగిలి వాల్వ్ లీకేజీతో తాగునీటిలో మురుగు నీరు చేరి కలుషిత నీరు సరఫరా అవుతోందని ప్రజలు వాపోతున్నారు.

◆ కొన్ని కాలనీల్లో తాగునీటి పైపులైన్ పగిలి రోడ్డు మీదే తాగునీరు వృథాగా ఏరులై పారుతున్నాయని పేర్కొంటున్నారు. సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే కొన్ని నెలలుగా తాగునీరు లీకేజీ ద్వారా రోడ్లపాలవుతున్నా తమకేమీ పట్టనట్లుగా నీటిని విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు వాపోతున్నారు.


◆ ప్రశ్నించిన వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిక్షాపుల్లర్స్ కాలనీలో తాగునీరు విడుదల చేసినప్పుడు స్థానికులు సరిపడ నీరు పట్టుకుని కులాయిలను కట్టేయాల్సింది పోయి రోడ్లపై వృథాగా వదిలివేస్తున్నారని విమర్శలున్నాయి. దీంతో వేల గ్యాలన్ల తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తాగునీటి పట్ల అవగాహన కల్పించకుండా చోద్యం చూస్తున్నారని చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సీజ్ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కూనామహాలక్ష్మినగర్ రోడ్డు..


రింగ్ బస్తీలో..

నిలిచిన బస్తీరోడ్ల నిర్మాణ పనులు !


కూనామహాలక్ష్మినగర్ రోడ్డు..


రింగ్ బస్తీలో..

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యను తీర్చిన అధికారులు రోడ్లు వేయడంలో మాత్రం ఆలస్యం చేస్తున్నారు. రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సంజయ్‌పురికాలనీ, కూనా మహాలక్ష్మినగర్, జగద్గిరినగర్, రింగ్ బస్తీలలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. డ్రైనేజీ పనులు పూర్తిచేసి సుమారు 6 నెలల నుంచి ఏడాది అవుతున్నా.. రోడ్డు పనులు మాత్రం ప్రారంభించకపోవడం విశేషం. ఈ అంతర్గత రోడ్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గాజులరామారం ఏఈ తిరుపతిని వివరణ కోరగా.. ఈ రోడ్లకు టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యిందని, ఈ వారంలోనే అన్ని పనులు ప్రారంభం అవుతాయని వివరించారు.

ప్రజా సమస్యలపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మోతీనగర్: మూసాపేట వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అన్ని శాఖల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పాల్గొని ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ శాఖ కూడా పనులు సరిగ్గా చేయడం లేదని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధిలైట్లు, విద్యుత్, శానిటేషన్, కాలుష్యం, తాగునీటి సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ సంబంధిత సిబ్బంది కాలనీల వారీగా పరిష్కారించాలని సూచించారు. లేదంతే శాఖాపరమైన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. బడ్జెట్ లేదని సాకులు చెప్పకూడదని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉమా, వర్క్ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఏఈ అనురాగ్, ఎలక్ట్రికల్ లైన్‌మెన్‌లు, వీధి లైట్లు సిబ్బంది నాగరాజు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సురేష్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, బీజేపీ నాయకులు ఎర్ర స్వామి, శ్రీనివాస్, జయకృష్ణ తదితరులున్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం మాటకు కట్టుబడి పనిచేస్తుంది'

అల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలను తప్పకుండా అమలు చేస్తుందని, ముందుగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసిందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీలోని పద్మావతి ప్లాజా ముందున్న బస్‌స్టాప్‌లో మహాలక్ష్మి పథకం, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఇతర పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సన్మానం



అల్విన్‌కాలనీ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, ఎంబీసీ కులాల అధ్యక్షుడు సాంద్రపల్లి వెంకటయ్యలు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాషిపాక యాదగిరిని మంగళవారం సన్మానించారు.

మహిళలపై హింసను అరికట్టాలి



శామీర్‌పేట్: మహిళలపై హింసను అరికట్టాలని మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా సాధికారత కేంద్రం సమన్వయకర్త ప్రియాంక ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామంలోని బాలికల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తెలిపారు. బాల కార్మిక, పోక్సో, చైల్డ్ లైస్ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల సంరక్షణ హెల్ప్‌లైన్ నంబర్- 100, 181, 1098, 14567 తదితర నంబర్ల ద్వారా ఫిర్యాదులు, సహాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శిల్ప, జెండర్ స్పెషలిస్ట్ భార్గవి, సవిత, ఫైనాన్షియల్ లిటరసీ స్పెషలిస్ట్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.75 కోట్లతో వరద నీటి కాలువ నిర్మాణం

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో సుమారు రూ.1.75 కోట్లతో చేపట్టిన వరద నీటి కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మంగళవారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీకాంతిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల సమస్య తీరుతుందని, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు అక్బర్‌ఖాన్, నరేందర్, అంజద్ పాషా, సందీప్ రెడ్డి, ఇబ్రహీం, ఖాసీం, అశు, అజ్జు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి మహిళల కృతజ్ఞతలు


దుర్గారాణి

కూకట్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలుచేస్తున్న క్రమంలో తొలిసారిగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుర్గారాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిజం చేస్తూ.. మహిళలు రాష్ట్ర పరిధిలో ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. మహిళలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. పెరుగుతున్న బస్సు ఛార్జీల వల్ల ఇబ్బంది పడుతున్న నిరుపేద మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ఈ సందర్భంగా చాలా సంతోషంగా ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన మాల్స్‌పై ఫిర్యాదు..


జెడ్‌సీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఏకాంత్‌గౌడ్

కూకట్‌పల్లి: ముంబై ప్రధాన జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రోడ్డును గత ప్రభుత్వ హయాంలో కబ్జా చేసి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన మాల్స్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకాంత్‌గౌడ్ మంగళవారం జెడ్సీ మమతకు ఫిర్యాదు చేశారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులమని చెప్పుకొని పలు షాపింగ్‌మాల్స్ వద్ద వారు రోడ్డును కబ్జాచేసి ర్యాంప్‌లను నిర్మించి పార్కింగ్ ఏర్పాటు చేసుకోవడం వల్ల నిజాంపేట వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని ఆమె సానుకూలంగా స్పందించి షాపింగ్‌మాల్స్‌కు నోటీసులు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పల్నాటి అశోక్, రమేష్, నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ వీజేఐఈటీ కళాశాల 'టై హైదరాబాద్' సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. టై గ్రాండ్ ప్లస్ గ్లోబల్ చైర్‌పర్సన్ డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ బాలాజీ, పార్టనర్ వివేక్‌వర్మ, సింప్లీబిజ్ అంకుర సంస్థ వ్యవస్థాపకుడు రఘుబాబు పాల్గొనగా.. కళాశాల తరపున డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు చెన్నకేశవరావు, డీన్ పద్మశాయి, వీజే హబ్ మేనేజర్ చక్రవర్తుల కిరణ్‌లు పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల మెంటర్లుగా వ్యవహరిస్తున్న వివేక్ వర్మ, రఘుబాబులు మాట్లాడుతూ.. విద్యార్థులు అంకురాల స్థాపనను తమ కెరీర్‌గా మలచుకోవాలన్నారు. అనంతరం భానుప్రకాష్ మాట్లాడుతూ.. తమ బార్‌ట్రానిక్స్ సంస్థ ద్వారా టీటీడీకి సుదర్శన టోకెన్ల వ్యవస్థను నెలకొల్పిన విషయాన్ని తెలియజేశారు.

మనూ-మై చాయిస్ మధ్య ఒప్పందం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్, మై చాయిస్ ఫౌండేషన్‌ల మధ్య అవగాహన ఒప్పందాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ ఫర్హానా ఖాన్, ఆపరేషన్స్ హెడ్, డాక్టర్ అనితాసేబుల్, ఐసీసీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ గుల్ఫిషాన్‌హబీబ్, మహిళా విద్యావిభాగం అధిపతి ప్రొఫెసర్ అమీనా తహసీన్ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



రాయదుర్గం: కార్తీక మాసం చివరి రోజు ఆలయాలు కిటకిటలాడాయి. పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు, జలాభిషేకాలను నిర్వహించారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరిసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో చంద్రమౌళీశ్వరస్వామి, రాజరాజేశ్వరిమాత ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

◆ టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో కాశీ నుంచి తెచ్చిన స్ఫటిక లింగానికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు, అలంకారం చేశారు.

◆ గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కాశీవిశ్వేశ్వరుడికి, అన్నపూర్ణాదేవికి పూజలు చేశారు.

◆ ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ శ్రీహనుమాన్ ధామ్ ఆశ్రమమ్‌లో, గౌలిదొడ్డిలోని శివాలయం, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండా, ఎన్టీఆర్‌కాలనీ, రాయదుర్గం ప్రాంతాలలో పూజలు చేశారు.

◆ మంగళవారం ఉదయం భక్తులు దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నుంచి దీపాలు వెలిగించారు.

లక్ష దీపోత్సవం

కార్తీకమాసాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం దీప కాంతులతో మెరిసిపోయింది. భక్తులు లక్ష దీపాలను వెలిగించారు. రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు, చైర్మన్ ఏ కృష్ణాగౌడ్, కరస్పాండెంట్ ఏ భరత్‌కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించారు. సహస్ర నామ పుష్పార్చన, మహా రుద్రాభిషేకం,శ్రీవారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మీ వెంకట్‌రెడ్డి దంపతులు, సతీష్‌గౌడ్, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భీష్మరెడ్డి, అంజిబాబు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకున్న బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య


హోమంలో పాల్గొన్న మక్కాల సత్యనారాయణ

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో పెద్దఎత్తున పూజలు, హోమాలు నిర్వహించారు. బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ అధ్వర్యంలో జరిగిన పూజలు, హోమాల్లో బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం హోమంలో మక్కాల సత్యనారాయణ పాల్గొనగా.. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రిటైల్ కూరగాయల మార్కెట్ వైస్ చైర్మన్ రమేష్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్, కార్యదర్శి నర్సింగ్‌రావు తదితరులున్నారు.